సాక్షి జోగులాంబ గద్వాల


బుధవారం । 30 । జూలై । 2025



అంతే నిర్లక్ష్యం..

పోలేపల్లి సెజ్ నుంచి వ్యర్థాలను పొలాల్లోకి వదులుతున్నారని రైతులు పేర్కొన్నారు.

వివరాలు 8లో ▸



పెరుగుతున్న వరద

జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న మంగళవారం వరద పెరిగింది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 34.6 /21.9

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

31న గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు

గట్టు/ధరూరు: గట్టుతోపాటు, ధరూరు, ధరూరు మండలం గుడ్డెందొడ్డిలో కొనసాగుతున్న అలంపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాళ్లు శోభారాణి, ఝాన్సి రాణి, స్పెషలాఫీసర్ గోమతి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, ఎంఎల్‌టీ గ్రూపులలో ప్రవేశాలకు అడ్మిషన్లను నిర్వహిస్తున్నట్లు, విద్యార్థులు 10వ తరగతి ఒరిజినల్ టీసీ, మార్కుల మెమో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 3 పాస్ ఫొటోలతో నేరుగా గురుకుల కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి సంప్రదించాలని కోరారు. అదే రోజు సాయంత్రం 4 గంటల తర్వాత ఎంపికైన వారి జాబితాను ప్రకటించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నవోదయ దరఖాస్తు గడువు పొడిగింపు

బిజినేపల్లి: వట్టెం నవోదయ విద్యాలయంలో 2026– 27 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువు మంగళవారంతో ముగియనుండగా దానిని ఆగస్టు 13వ తేదీ వరకు పొడిగించినట్లు విద్యాలయ ప్రిన్సిపల్ భాస్కర్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆగస్టు 13లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గద్వాల క్రైం: నదీతీర ప్రాంతాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దిగువ ప్రాంతాలకు నీటిని విడుదల చేస్తున్నారని, ఈ నేపథ్యంలో జూరాల ప్రాజెక్టుకు భారీ స్థాయిలో వరద రావడంతో జూరాల జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో నదీతీర ప్రాంతాల్లోని ప్రజలు, రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై పోరాటం

గద్వాలటౌన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, సమస్యల సాధన కోసం దశలవారీగా పోరాటం సాగిస్తామని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) నాయకులు హెచ్చరించారు. పోరాటంలో భాగంగా ఆగస్టు 1వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. మంగళవారం కమిటీ నాయకులు ధర్నాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ధర్నాకు అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు గోపాల్, ప్రభాకర్‌శాస్త్రి, ఉదయ్‌కిరణ్, హరిబాబు, వెంకటరమణ, ప్రకాష్, మాధవన్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి

గద్వాలటౌన్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను తక్షణమే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేద వర్గాల విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపకరించే ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా రంగం అభివృద్ధిలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చాంద్‌పాషా, ప్రధాన కార్యదర్శిగా సురేందర్, ఉపాధ్యక్షులుగా రాజు, తిరుమలేష్, రాకేష్ ఎన్నుకున్నారు.

ఎక్కడి పనులు అక్కడే!

పురపాలికల్లో ప్రత్యేక అధికారుల పాలన మరో ఆర్నెళ్లు పెంపు



జిల్లా కేంద్రంలో రోడ్డు పక్కన పేరుకుపోయిన మురుగు

- అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా కానరాని నివారణ చర్యలు
- పన్ను వసూళ్లపై రాజకీయ నాయకుల పెత్తనం
- పడకేసిన పథకాలు.. నత్తనడకన అభివృద్ధి పనులు
- కనిపించని 'ప్రత్యేక' మార్క్

గద్వాలటౌన్: సర్కార్ మళ్లీ ప్రత్యేక పాలన పెంపునకే మొగ్గుచూపింది. ఇప్పటికే ఎక్కడి పనులు అక్కడే పడి వున్నా స్పందించేవారు కరవయ్యారు. తాజాగా మున్సిపాలిటీలకు ప్రత్యేకాధికారుల పాలన మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. ఈ మేరకు మున్సిపాలిటీలకు ఉత్తర్వులు అందాయి. అయితే వచ్చే ఆరు నెలల్లో మున్సిపాలిటీల పనితీరు ఇంకా ఏమేరకు దిగజారుతుందన్నదే ఇప్పుడు అందర్నీ వేధిస్తున్న ప్రశ్న..? గత ఆరు నెలలుగా జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలో ప్రత్యేక అధికారి పాలన సాగుతుంది. ఇప్పటికే అస్తవ్యస్తంగా ఉన్న గద్వాల మున్సిపాలిటీ పరిస్థితి మరింత దీనంగా తయారు కానుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. పాలన నత్తనడకన సాగుతోంది. అభివృద్ధి పనులు మందగించాయి. గద్వాల మున్సిపాలిటీలో ప్రత్యేకాధికారి ముద్ర ఏమాత్రం లేదు. అడిషినల్ కలెక్టర్ నర్సింగరావు ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు ఆయనతో పాటు కమిషనర్ దశరథ్‌పై రాజకీయ ఒత్తిళ్లు ఎక్కువగా పని చేస్తున్నాయి. నాయకులను కాదని ఆయన ఏ పనీ చేయలేకపోతున్నారు. సిబ్బంది కొరత కూడ ఆయన కాళ్లకు బంధాలు వేస్తోంది.

పడకేసిన పథకాలు..

అమృత్ 2.0 పథకం కింద చేపట్టిన తాగునీటి ప్రాజెక్టు పనులను చూస్తే నత్తే నయమనిపిస్తుంది. డబుల్ బెడ్‌రూం ఇళ్ల అప్పగింత కాగితాలకే పరిమితం అయింది. ఇందిరమ్మ ఇళ్ల పురోగతి కనిపించడం లేదు. ఐదేళ్లు గడుస్తున్నా పట్టణ ఆడిటోరియం భవన నిర్మాణం పనుల ప్రారంభానికి మోక్షం లభించడం లేదు. రోడ్ల అభివృద్ధి, విస్తరణ అనేది మర్చిపోయారు. రింగ్‌రోడ్డు అభివృద్ధి ఊసేలేదు. కూరగాయల మార్కెట్‌తో పాటు ఇతర దుకాణాల నుంచి ఆదాయం లభించడం లేదు. ఐడీఎస్ఎంటీ దుకాణాల లీజు పూర్తయినా చర్యలు లేవు. ప్రకృతి వనాల నిర్వహణ గాడితప్పింది. అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నా నివారణ చర్యలు కనిపంచడం లేదు. పన్ను వసూళ్లపై రాజకీయ పెత్తనం కనిపిస్తుంది. ఇలా ఏది తీసుకున్నా అంగుళం కూడా ముందుకు కదల్లేదు. పథకాలన్నీ 'ఎక్కడవేసిన గొంగడి అక్కడే' అన్న చందంగా మారాయి. పట్టణంలో ఏ సమస్యనైనా ఇదివరకు ప్రజలు తమ వార్డు కౌన్సిలర్ వద్దకు వెళ్లి మొరపెట్టుకునేవాళ్లు. చాలా సమస్యలు వాళ్ల స్థాయిలో పరిష్కారమయ్యేందుకు అవకాశం ఉండేది. ప్రస్తుతం ప్రజలు తమ సమస్యలను కమిషనర్, ప్రత్యేక అధికారి దృష్టికే తీసుకువెళ్లాల్సి వస్తోంది. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పట్టణంలో పారిశుద్ధ్య పరిస్థితి కూడా అంతంతమాత్రంగానే ఉంది. తాగునీటి సరఫరాలోనూ ఇబ్బందులతో పాట్లు తప్పడం లేదు. వార్డు ఆఫీసర్లు ఉన్నా వారికి మొక్కుబడి పనులే అప్పగిస్తున్నారు. ఈ ఆరు నెలల కాలంలో పట్టణంలో గొప్పగా చెప్పుకునే పథకం ఒక్కటీ లేదు.

సాగని పుర'పాలన'

ప్రత్యేక అధికారి తన సొంత శాఖలోని విభాగాల్లో ఉన్న పనుల వల్ల మున్సిపాలిటీపై దృష్టి పెట్టలేకపోతున్నారు. నిధుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. మున్సిపాలిటీలోని రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ విభాగాలు పూర్తిగా గాడితప్పాయి. ఏదైనా పని చేయాలన్నా పూర్తిగా స్థానిక ప్రజాప్రతినిధి, నాయకుల కనుసన్నల్లోనే నిర్వహించాల్సి వస్తోంది. వారికి ఎదురు వెళ్లి అనవసరంగా ఇబ్బందులు తెచ్చుకోవడం ఎందుకని మున్సిపాలిటీ వైపే చూడడం తక్కువ చేశారు. పనులను ప్రాధాన్య క్రమంలో ఎంపిక చేయడంలో లోపాలు, నిధుల వినియోగం సక్రమంగా లేకపోవడం వంటి కారణాల వల్ల మున్సిపాలటీలో కనీస వసతుల కల్పనలో కూడ ఇబ్బందులు తప్పడం లేదు. మరో ఆరు నెలల వరకు కనీస సౌకర్యాలకు నోచుకోక ప్రజలు సర్దుకుపోవాల్సిందే. ఆ తర్వాతైనా ఎన్నికలు జరుగుతాయా? అంటే కచ్చితంగా జరుగుతాయని చెప్పలేని పరిస్థితి నెలకొంది. మళ్లీ ఎన్నికలు వస్తాయన్న ఆశతో మాజీ కౌన్సిలర్లు మొదట్లో జనానికి దగ్గరగా ఉండే ప్రయత్నం చేశారు. వారు సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేసేవారు. ఇప్పట్లో ఎన్నికలు జరిగే అవకాశం లేదని తేలిపోవడంతో వాళ్లు కూడా జనం సమస్యలను వదిలేసి సొంత పనులు చూసుకుంటున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టండి



ఎక్కడా లేని విధంగా నాలలు, కందకాలు కబ్జాకు గురయ్యాయి. అధికారులు, పాలకుల ఉదాసీనత వల్లే అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు పెరిగాయి. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అక్రమ నిర్మాణాలు, కబ్జాలపై చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించాలి. తద్వారా రానున్న రోజుల్లో ఎదుర్కొనే సమస్యల పరిష్కారంపై స్పష్టత వస్తుంది. ఇప్పటికైనా మేల్కొనపోతే భవిష్యత్‌లో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

– శ్రీధర్, గద్వాల

దారులు అధ్వానం



పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీ అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఎక్కడపడితే అక్కడ గుంతలు ఏర్పాడ్డాయి. నిత్యం గుంతల రోడ్లపై ప్రయాణం అంటే సాహసం చేయాల్సి వస్తోంది. ప్రమాదాలు చోటుచేసుకుంటున్న అధికారుల పట్టనట్లుగా ఉన్నారు. మరమ్మతులు సైతం మొక్కుబడిగా చేపట్టి చేతులు దులుపుకొంటున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి రహదారులను మెరుగుపర్చాలి.

– గోపాల్, గద్వాల

మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యం



మల్దకల్‌లో మహిళా సంఘాల సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్: కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మల్దకల్‌లో గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, కలెక్టర్ బీఎం సంతోష్, అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలను కోటీశ్వర్లు చేయడమే లక్ష్యంగా మహిళా సంఘాలకు ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నట్లు, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే నియోజక వర్గం అన్ని రంగాల్లో ముందుకు వెళుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోని మరింత అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన 6 గ్యారెంటీలలో రైతుబంధు, రణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు, రూ.500 కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లు కరెంట్ ఉచితం, ఇందిరమ్మ ఇల్లు, సన్న బియ్యం పంపిణీ వంటి సంక్షేమ పథకాలను నిరుపేద ప్రజలకు అందించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్దిదారునికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

మహిళలు చదువుకోవాలి: కలెక్టర్

మహిళలందరు తప్పనిసరిగా చదువుకోవాలని అప్పుడే ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం సోలార్ విద్యుత్ ప్లాంటు, మూడు బస్సులు, త్వరలో పెట్రోల్ బంకులతో పాటు ఇందిరా మహిళా శక్తి సంఘాలకు వడ్డీ లేని రుణాలను అందించి ఆదుకోవడం జరుగుతుందన్నారు. మండలంలోని నిరుపేదలకు 900 రేషన్‌కార్డులు ఇవ్వడం జరిగిందన్నారు. మండలంలోని మహిళా సంఘాలకు గత ఏడాది రూ.26 కోట్లు రుణంగా మంజూరు చేయగా ఈ ఏడాది రూ.72 లక్షలు వడ్డీ మాఫీ చేశామన్నారు. అంతకు ముందు జిల్లా స్థాయిలో ఉత్తమ పీఎం శ్రీ పాఠశాలగా ఎంపికైన మల్దకల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, తిమ్మారెడ్డి, సీతారామిరెడ్డి, సత్యారెడ్డి, విక్రమ్‌సింహారెడ్డి, రాజారెడ్డి, వీరన్న, నరేందర్‌గోపాల్‌రెడ్డి, తహసీల్దార్ ఝాన్సీరాణి, ఎంపీడీఓ సాయిప్రకాష్, అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్



మల్దకల్ జెడ్పీహెచ్ఎస్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

మల్దకల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతంగా ఎదగాలని కలెక్టర్ బీఎం సంతోష్ సూచించారు. మంగళవారం మల్దకల్ జెడ్పీహెచ్ఎస్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిష్టర్‌లను పరిశీలించారు. గత ఏడాది పదో తరగతి ఫలితాలపై ఆరా తీసి ఈ ఏడాది వంద శాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. అనంతరం పాఠశాల తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుందని, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించి పిల్లల చదువుపట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ పీఎం శ్రీ పాఠశాలగా ఎంపికైన మల్దకల్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుని, ఉపాధ్యాయులను అభినందించారు. అదే విధంగా పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్, జిల్లా సెక్టోరియల్ అధికారి ఎస్తేర్‌రాణి, జాకీర్‌హుసేన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లక్కీడిప్ ద్వారా విద్యార్థుల ఎంపిక



విద్యార్థుల తల్లిదండ్రులతో లక్కీడిప్ తీయిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు

గద్వాల: బెస్ట్‌అవైలబుల్ పాఠశాలలో మిగిలిన సీట్లను నిబంధనల మేరకు లక్కీడిప్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేసినట్లు అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు తెలిపారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో ఎస్సీ సంక్షేమాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో గ్రూప్–3లో మిగిలిన సీట్లకు దరఖాస్తులు లేకపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రూప్–1, గ్రూప్–2 నుంచి దరఖాస్తు చేసిన విద్యార్థులను వారి తల్లిదండ్రుల సమక్షంలో లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. మొత్తం 20 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. వీరిలో 1వ తరగతిలో ఏడు మంది విద్యార్థులు, 5వ తరగతిలో 13మంది విద్యార్థులు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు తమ ధ్రువపత్రాలను తీసుకుని ఎస్సీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. లక్కీడిప్ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమాభివృద్ధి శాఖ జిల్లా అధికారి నుషిత, కో–ఆర్డినేటర్ ఆంజనేయులు, కెజిబివి కన్వీనర్ హంపయ్య, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయస్థాయికి 'అనంతపురం' విద్యార్థుల ప్రాజెక్టు



ఢిల్లీలో జాతీయ స్థాయి ప్రదర్శనలో అనంతపురం విద్యార్థులు

గద్వాలటౌన్ : 2024–25 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్రస్థాయి స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ ప్రదర్శనలో గద్వాల మండలం అనంతపురం పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ చాటారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ సెల్ వారు పాఠశాల విద్యార్థులకు ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. అనంతపురం పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు జానకమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులు ఇర్ఫాన్, పవన్, ప్రశాంత్ ఇన్నోవేషన్ మారథాన్ ప్రదర్శనలో ప్రతిభ చాటారు. 'మొక్కజొన్న కంకులపై పొట్టుతో తయారు చేసిన ఎకో ఫ్రెండ్లీ కార్న్ హస్క్ పెన్స్' అనే అంశంపై ప్రాజెక్టును రూపొందించగా.. ఆ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. జులై 28 నుంచి 31 వరకు ఢిల్లీలో జరుగుతున్న జాతీయస్థాయి ఇన్నోవేషన్ మారథాన్ ప్రదర్శనకు ఎంపిక చేశారు. దేశ వ్యాప్తంగా మొత్తం 27 ప్రదర్శనలను ఎంపిక చేశారు. ఇందులో రాష్ట్రం నుంచి గద్వాలతో పాటు సిద్దిపేట, సిరిసిల్ల పాఠశాలలు ఉన్నాయి. అనంతపురం విద్యార్థులు జాతీయస్థాయి ఇన్నోవేషన్ మారథాన్ ప్రదర్శనకు ఎంపిక కావడంపై డీఈఓ అబ్దుల్ ఘనీ, ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, జిల్లా సైన్స్ అధికారి బాస్కర్‌పాపన్న, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



పాల్వాయిలో ఎరువులు, స్టాక్ రికార్డులను పరిశీలిస్తున్న డీఏఓ సక్రియానాయక్

మల్దకల్: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని డీఏఓ సక్రియానాయక్ ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులను హెచ్చరించారు. మంగళవారం పాల్వాయి గ్రామంలోని ఫర్టిలైజర్ షాపును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎరువులను విక్రయించిన వెంటనే రశీదులను ఇవ్వాలని, విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా షాపు యజమానులతో రశీదులు పొందాలన్నారు. ఫర్టిలైజర్ షాపులలో ఈ – పాస్‌మెషిన్ ద్వారానే మందులు పంపిణీ చేపట్టాలని, స్టాక్ వివరాలను రికార్డులలో పొందుపరచాలన్నారు. అనుమతులు లేని ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్, ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులు పాల్గొన్నారు.

హైదరాబాద్ చేరిన నాయకుల పంచాయితీ



పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఫిర్యాదుచేస్తున్న సరిత వర్గం నాయకులు

గద్వాల: నియోజకవర్గంలో అధికార పార్టీలో నెలకొన్న వర్గపోరు హైదరాబాద్‌కు చేరింది. మంగళవారం జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత వర్గం నాయకులు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొంది కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి అధిక ప్రాధాన్యత ఇస్తూ నిజమైన కాంగ్రెస్ పార్టీ నాయకులను విస్మరించడంతో పాటు అక్రమ కేసులు నమోదు చేస్తూ ఇబ్బందులు గురిచేస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా నామినేటెడ్ పదవులు, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ, ఇందిరమ్మ కమిటీలలో పదవులు అన్ని కూడా ఎమ్మెల్యే వర్గానికి ఇస్తూ తీవ్ర అన్యాయం చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థలలో బీ–ఫారాలను పాత కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఇవ్వాలని, ఇదేవిషయంపై పలు మార్లు అధిష్టానానికి ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. పరిస్థితి ఇదేవిధంగా కొనసాగితే అన్ని మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఛలో గాంధీభవన్‌కు పాదయాత్ర చేపట్టాల్సి వస్తుందన్నారు కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ శంకర్, డీఆర్ శ్రీధర్, లత్తిపురం వెంకట్రామిరెడ్డి, వెంకటస్వామిగౌడ్, కృష్ణ, డీటీడీసీ నర్సింహులు, ఆనంద్‌గౌడ్, పటేల్ శ్రీనివాసులు, ప్రకాష్, మాభాషా, రాఘవేంద్రరెడ్డిలు ఉన్నారు.

తేళ్లు కుట్టని పంచమి

అరచేతిలో తేలు.. ఆనందంలో యువతి







తేలు కొండి పట్టుకున్నా కుట్టలే.., నాలుకపై తేలు వేసుకుంటూ..



కొండమవ్వను దర్శించుకునేందుకు బారులుదీరిన భక్తులు

తేళ్లను చూస్తేనే ఒళ్లు జలదరిస్తుంది. ఎక్కడ కుట్టి చంపేస్తుందేమోననే భయంతో ఆమడదూరం పారిపోతాం. కానీ, తేలు కుట్టని రోజంటూ ఒకటుందని మీకు తెలుసా.. అదే తేళ్ల పంచమి. ఈ రోజు తేలును పట్టుకున్నా.. ఒంటిపై, చెంపపై, చేతిపై వేసుకున్నా.. ఏకంగా నోట్లో నాలుకపై పెట్టుకున్నా ఏమీ చేయని అరుదైన దృశ్యాలను రాష్ట్ర సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం యాద్గీర్ జిల్లా కందుకూరులో చూడవచ్చు. నాగుల పంచమి పర్వదినమైన మంగళవారం నాడు తేళ్ల పంచమిని పురస్కరించుకొని స్థానికంగా కొండమవ్వగుట్టపైకి వందలాది మంది తరలివెళ్లి తేళ్ల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. గుట్టపై రాళ్ల కింద, చెట్ల పొదల్లో ఉన్న తేళ్లను చిన్నా, పెద్ద తేడా లేకుండా పట్టుకొని సందడి చేశారు. మరికొందరు తమ ఇంటికి తేళ్లను తీసుకెళ్లి పూజించారు. తేళ్ల పంచమి జరుపుకోవడం ద్వారా తమను తాము తేళ్ల బారి నుంచి రక్షించుకోవచ్చని నమ్ముతారు. ఈ జాతరకు వేలాదిగా రాగా గుర్మిట్కల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

– నారాయణపేట

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ఖిల్లాఘనపురం: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సోళీపురంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎదిరె కృష్ణ(బంగారి(30), భార్య మంగమ్మకు తరచూ సంసారం విషయంలో గొడవ జరిగేది. దీంతో మంగమ్మ తన తల్లితండ్రుల వద్దే ఉంటుంది. ఇంటికి రావాలని తరచుగా భర్త అక్కడికెళ్లి గొడవపడేవాడు. సోమవారం మంగమ్మ ఆస్పత్రికి వెళ్లి మహబూబ్‌నగర్‌లోని తన పెద్దమ్మ బాలకిష్టమ్మ వద్ద ఉన్నది. ఇదిలా ఉండగా.. మంగళవారం కృష్ణ సోళీపురంలోని తన ఇంట్లో కొండికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన మృతుడి తండ్రి వెంకటయ్య మంగమ్మకు సమాచారం ఇచ్చాడు. ఆమె వచ్చి ఖిల్లా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేశ్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా: డ్రైవర్ మృతి

కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్‌లో మంగళవారం ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ డేరంగుల వెంకటయ్య(52) మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. ట్రాక్టర్‌లో రాయిని దించి తిరిగి ఇంటికి వస్తుండగా.. మూలమలుపు వద్ద ట్రాక్టర్ బోల్తాపడడంతో వెంకటయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడినికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

జడ్చర్ల: అనుమానస్పదంగా ఓ వ్యక్తి మృతిచెందినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. సీఐ కథనం మేరకు.. వనపర్తి జిలా ఖిల్లాఘనపురం మండలం అప్పిరెడ్డిపల్లికి చెందిన లట్టుపల్లి రామకృష్ణ(25) రెండేళ్ల క్రితం ఇంట్లో చెప్పకుండా వచ్చి జడ్చర్లలోని ఇందిరానగర్ కాలనీలో అంజలితో సహజీవనం చేస్తున్నాడు. ఇటీవల విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు జడ్చర్లకు వచ్చి రామకృష్ణను అప్పిరెడ్డిపల్లికి తీసుకెళ్లారు. తర్వాత మళ్లీ ఎవరికీకి చెప్పకుండా ఇంటినుంచి వచ్చాడు. అనంతరం మంగళవారం ఇందిరానగర్‌లోని అంజలి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తమ కుమారుడి మృతిపై అనుమానం ఉందని తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అదే కాలుష్యం.. అంతే నిర్లక్ష్యం



పరిశ్రమలో కలుషిత నీటిని పరిశీలిస్తున్న అధికారులు

- పోలేపల్లి సెజ్ పరిశ్రమల్లో వెలుగుచూసిన నిజాలు
- కలెక్టర్ ఆదేశంతో అధికారుల విస్తృత తనిఖీలు
- మీ తీరు మారదా.. అంటూ కంపెనీ ఇన్‌చార్జ్‌లపై ఆగ్రహం
- తనిఖీల సమాచారం తెలుసుకొని కంపెనీలు అప్రమత్తం
- కొన్ని పరిశ్రమల్లో గేట్లు వేసి అధికారులను లోపలికి రానివ్వని వైనం



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రాజాపూర్: పరిశ్రమల నుంచి వ్యర్థాలను.. కలుషిత, రసాయన నీటిని పొలాల్లోకి వదులుతున్నారని.. పంటలు వేసినా పండడం లేదని.. కంపెనీల నుంచి వచ్చే పొగతో వాయుకాలుష్యం అవుతుందని.. ఎన్నోరకాలుగా ఇబ్బందులు పడుతున్నామంటూ పోలేపల్లి సెజ్ పరిసర గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. తాజాగా ప్రజావాణిలో పలు గ్రామాల రైతులు ఫిర్యాదు చేయడంతో అధికారులు తనిఖీలు చేయగా.. అదే కాలుష్యం.. అంతే నిర్లక్ష్యంతో సదరు కంపెనీలు, సిబ్బంది వ్యవహరించడం కనిపించింది. యథేచ్ఛగా పొలాల్లోకి కలుషిత నీటిని వదలడంతో అధికారులు హెచ్చరించారు. వివరాల్లోకి వెళ్తే.. రాజాపూర్ మండలం రాయపల్లి, ముదిరెడ్డిపల్లి గ్రామాల రైతులతో పాటు జడ్చర్ల మండలం పోలేపల్లి గ్రామ రైతులు కాలుష్య జలాలను వదులుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని 'ప్రజావాణి'లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ విజయేందిరబోయి కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, జిల్లా ఇండస్ట్రియల్, వ్యవసాయశాఖ, గ్రౌండ్‌వాటర్ అధికారులను కమిటీ వేసి వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

విస్తృత తనిఖీలు..

దీంతో మంగళవారం జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పీసీబీ ఈఈ సురేష్, జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్‌రావ్, జిల్లా ఇండస్ట్రీస్ అధికారి ప్రతాప్‌రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వర్లు పోలేపల్లి సెజ్‌లోని పరిశ్రమల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. పరిశ్రమల్లో నుంచి వ్యర్థాలను రైతుల వ్యవసాయ పొలాల్లోకి వదిలే రంధ్రాలను గమనించి వెంటనే వీటిని మూసివేయాలని ఆయా పరిశ్రమల ప్లాంట్ ఇంచార్జ్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా సంబంధిత అధికారులకు ఎన్నో పర్యాయాలు ఫిర్యాదులు చేస్తున్నా.. వారు పరిశ్రమల నుంచి యథావిధిగా మా పొలాల్లోకి కాలుష్యపు జలాలు వదులుతున్నారని పోలేపల్లి రైతు రఘునందన్‌చారి అధికారులకు గోడు విన్నవించారు. ఓ పరిశ్రమలో అధికారులు తనిఖీలు చేస్తుండగా.. సమాచారం అందుకున్న మిగతా పరిశ్రమల ఇంచార్జ్‌లు అప్రమత్తమయ్యారు. పరిసరాలు శుభ్రంగా చేయడంతోపాటు కాలుష్యం కానరాకుండా చేశారు. ఇదిలాఉండగా, అధికారులు లోపలికి వెళ్లకుండా హెటిరో పరిశ్రమ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోవడంతో వ్యవసాయశాఖ అధికారులు పరిశ్రమ గేటు బయటే ఉండిపోయారు.

పంటలు పండడంలేదంటూ రైతుల ఆవేదన

ఈ పరిశ్రమల మూలంగా జల, వాయు కాలుష్యంతో తాము వ్యవసాయం చేయలేక, చేసినా పంటలు పండక ఇబ్బందులు పడుతున్నామని రాయపల్లి, ముదిరెడ్డిపల్లి గ్రామాల రైతులు అధికారుల ముందు వాపోయారు. ఇక్కడ ఏం జరుగుతుందో తమకు అంతా తెలుసని, ఎన్నిసార్లు చెప్పినా తమ తీరు మార్చుకోరా అంటూ అధికారులు పరిశ్రమల ఇంచార్జ్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఫార్మా పరిశ్రమతో కాలుష్యం అంతకంతా పెరిగిపోయి ఇబ్బందులు పడుతుంటే కొత్తగా బాలాక్సీ అనే పరిశ్రమలకు అనుమతులు ఇచ్చారని రైతులు తెలిపారు. దీంతో ఆ పరిశ్రమను సైతం పరిశీలించి పరిశ్రమలో పీసీబీ అనుమతులు లేకుండా పెద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయడంతో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సురేష్ గుర్తించారు. దీనిని నిర్మించేందుకు అనుమతులు ఉన్నాయా అంటూ పశ్నించారు. ఇంకుడు గుంతలు నిర్మించి కాలుష్య జలాలను వాటిలో వదులుతుండటంతో తమ వ్యవసాయ బోర్లలోని భూగర్భజలాలు కలుషితవుతున్నాయని రైతులు పేర్కొన్నారు. ఇలాంటి కాలుష్యం వదిలే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులను కోరారు.



కోనేరులోకి చేరిన నీరు

గుండాల కోనేటికి జలకళ

వెల్దండ: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన మండలంలోని గుండాలలో ఉన్న అంబా రామలింగేశ్వర స్వామి ఆలయ కోనేరు జలకళను సంతరించుకుంటుండటంతో భక్తులు భారీగా తరలివచ్చి దర్శించుకుంటున్నారు. ఫిబ్రవరి 26న మహాశివరాత్రి సందర్భంగా కల్వకుర్తి జేపీనగర్‌లో చదివే ఓ విద్యార్థి ప్రమాదవశాత్తు కోనేరులో మునిగి మృతిచెందాడు. ఆ సమయంలో ఎన్డీఆర్ఎఫ్ బృందం మోటారు సాయంతో మూడు రోజుల పాటు కోనేటిలోని నీటిని బయటకు తోడి మృతదేహాన్ని బయటకు తీశారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న కోనేరు సుమారు 160 గడుల లోతు ఉన్నట్లు వారు పేర్కొన్నారు. అప్పటి నుంచి కోనేరు ఖాళీగా ఉండటంతో ద్వారాలు మూసివేశారు. వర్షాకాలం కావడంతో నీరు కొద్ది కొద్దిగా ఉబికి వస్తుండటంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శ్రావణ మాసం కావడంతో కోనేటిలో స్నానాలకు అనుమతించాలని భక్తులు దేవాదాయశాఖ అధికారులను కోరుతున్నారు. వివాహం, సంతానం లేని వారు ఇక్కటి కోనేటిలో స్నానం చేసి శివలింగానికి అభిషేకం చేస్తే ఫలితం ఉంటుందని భక్తుల నమ్మకం.



ఖాళీగా ఉన్న కోనేరు (పాత చిత్రం)

అటవీ సంపద పెంపునకు సహకరించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: అటవీ సంపద పెంపునకు సామిల్, టింబర్ డిపోల యాజమానులు సహకారం అందించాలని జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జోగులాంబ జోన్ సామిల్స్, టింబర్ డిపోల యాజమానుల అసోసియేషన్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలప అక్రమ రవాణాను ఎవరూ ప్రోత్సహించవద్దని కోరారు. ప్రభుత్వం అడవుల శాతాన్ని పెంచేందుకు అన్ని శాఖల సమన్వయంతో వనమహోత్సవం కార్యక్రమం ద్వారా విరివిగా మొక్కలు నాటనున్నట్లు పేర్కొన్నారు. అటవీ శాఖ అనుమతి లేనిది కలప రవాణా, నిల్వ చేయవద్దని సూచించారు. అనంతరం డీఎఫ్ఓ సత్యనారాయణను సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ నాయకులు రమణయ్య, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల్ నాయకులు నవీన్‌పటేల్, సిద్దిఖ్, శేషుకుమార్, ముస్తఫా, ముఖేశ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



డీఎఫ్ఓ సత్యనారాయణను సన్మానిస్తున్న డిపోల యాజమానులు

జూరాలకు పెరుగుతున్న వరద



సుంకేసుల నుంచి దిగువకు పారుతున్న వరద

12 క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు మంగళవారం ఎగువ నుంచి వస్తున్న వరద కాస్త పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం 1.34 లక్షల క్యూసెక్కులు ఉండగా.. మంగళవారం రాత్రి 7.30 గంటల సమయంలో 1.40 లక్షల క్యూసెక్కులకు చేరిందన్నారు. దీంతో ప్రాజెక్టు 12 క్రస్ట్ గేట్లు పైకెత్తి 1,19,064 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు చెప్పారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 27,395 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315, నెట్టెంపాడుకు 750, ఆవిరి రూపంలో 45, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 600, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 500 క్యూసెక్కులు విడుదల చేసినట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.817 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు చెప్పారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి..

ఆత్మకూర్: జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిర్విరామంగా కొనసాగుతోంది. మంగళవారం 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ 5 యూనిట్ల నుంచి 195 మెగావాట్లు, 172.074 మి.యూ, దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 204.431 మి.యూ. విద్యుదుత్పత్తి చేశామని.. ఇప్పటి వరకు 376.505 మి.యూ, విజయవంతంగా పూర్తి చేసినట్లు వివరించారు.

సుంకేసులకు 1.25 లక్షల క్యూసెక్కులు..

రాజోళి: సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద రోజురోజుకు పెరుగుతోంది. సోమవారం 90 వేల క్యూసెక్కులు ఉండగా.. మంగళవారం లక్ష క్యూసెక్కులు దాటింది. ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి 1.25 లక్షల క్యూసెక్కుల వరద రాగా.. 10 గేట్లు ఒక మీటర్ మేర, మరో 11 గేట్లను 2 మీటర్ల మేర పైకెత్తి 1,22,326 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. కేసీ కెనాల్‌కు 1,847 క్యూసెక్కుల నీటిని వదిలినట్లు ఆయన పేర్కొన్నారు.

మహిళా సంఘాలకు విరివిగా రుణాలివ్వాలి



జ్యోతి ప్రజ్వల చేస్తున్న సెర్ప్ బ్యాంక్ లింకేజీ డైరెక్టర్ వైఎన్ రెడ్డి, ఇతర అధికారులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహిళ సాధికారితకు స్వయం సహాయక మహిళా సంఘాలకు బ్యాంకర్లు విరివిగా రుణాలివ్వాలని సెర్ప్ బ్యాంక్ లింకేజీ డైరెక్టర్ వైఎన్ రెడ్డి బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన బ్యాంకర్లు, డీపీఎం, ఏపీఎంలతో సమావేశం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశానుసారం బ్యాంకర్లు రుణాలివ్వాలన్నారు. రుణాలివ్వకుంటే మహిళా సంఘాల సభ్యులు మైక్రో ఫైనాన్స్‌లను ఆశ్రయిస్తారని దీంతో మరో ప్రమాదం ఉందని తెలిపారు. మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను కచ్చితంగా చెల్లిస్తారని.. వారి నుంచి వందశాతం రుణాలు రికవరీ అవుతాయన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకు 2025–26 ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన బ్యాంక్ లింకేజీ రుణ లక్ష్యం రూ.385 కోట్లు పెట్టినట్లు ఈ మొత్తం 9854 మహిళ సంఘాలకు ఇవ్వాలన్నారు. ఈ మొత్తం లక్ష్యం పూర్తి అయ్యేటట్లు బ్యాంకర్లు సహకరించాలన్నారు. తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు వాటిని తిరిగి చెల్లించేలా మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఆర్‌డీఓ నర్సిములు, డీఆర్‌డీఓ ఏపీడీ శారద, డీపీఎం లక్ష్మయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ 300 ఆలౌట్

సెంచరీతో రాణించిన అబ్దుల్ రాఫే



అబ్దుల్‌రాఫే (111 పరుగులు)

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన బి–డివిజన్ టుడే లీగ్ చాంపియన్‌షిప్‌లో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు మెరుగైన స్థితిలో ఉంది. వెస్ట్‌మారేడ్‌పల్లి జట్టుతో జరిగిన మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ టాస్ గెలిచి మొదటి బ్యాటింగ్ చేసి 85.1 ఓవర్లలో 300 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో ఓపెనర్ అబ్దుల్ రాఫే (194 బంతుల్లో 10 ఫోర్లతో 111 పరుగులు) అద్భుతమైన సెంచరీతో రాణించాడు. జట్టులో బి.సంజయ్ (53), కేతన్‌కుమార్ (43), కొండ శ్రీకాంత్ (30) సత్తా చాటారు. ప్రత్యర్థి బౌలర్లలో తరుణ్‌చంద్ర 3, సజ్జా సాయి ప్రణవ్, సిద్దార్థ రెండేసి వికెట్లు తీసుకున్నారు. బుధవారం వెస్ట్‌మారేడ్‌పల్లి జట్టు బ్యాటింగ్ చేపట్టనుంది.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



రోగితో మాట్లాడుతున్న ఫణీంద్ర రెడ్డి

పాలమూరు: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీజీఎంఎస్ఐడీసీ చైర్మన్ ఫణీంద్ర రెడ్డి సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆస్పత్రిని మంగళవారం ఆయన సందర్శించారు. మొదట జనరల్ మెడిసిన్ పురుషుల, మహిళల వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం డైట్ విభాగాన్ని సందర్శించి ఆహార పదార్థాలను, నిల్వ ఉన్న కూరగాయాలు, ఇతర కిరాణ సామాన్ల స్టాక్‌ను తనిఖీ చేశారు. అదేవిధంగా ఎంసీహెచ్ బ్లాక్, సీటీ స్కాన్, పోస్ట్ ఆపరేటీవ్ వార్డు, సెంట్రల్ డ్రగ్‌స్టోర్, ఆస్పత్రిలోని మెయిన్ డ్రగ్ స్టోర్‌ను తనిఖీ చేసి వైద్యాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో కావాల్సిన మందులను, పడకలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలు నిత్యం శానిటైజేషన్ చేపట్టి పరిసరాలను శుభ్రంగా పెట్టుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, డీఐవో పద్మజా, నారాయణపేట కళాశాల ప్రిన్సిపల్ సంపత్‌కుమార్, డాక్టర్ సునీల్‌కుమార్, అమరావతి, శశికాంత్, భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

'బీజేపీలో బీసీలకు సముచిత స్థానం'

పాలమూరు: రాష్ట్రంలో బీజేపీ బీసీలకు సముచిత స్థానం కల్పించిందని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాదయ్య, పార్లమెంట్ అధికార ప్రతినిధి మెట్టుకాడి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో మహబూబ్‌నగర్‌లో బీసీలపై అక్రమంగా కేసులు పెట్టి.. జైళ్లకు పంపించినప్పుడు బీఆర్ఎస్‌లో ఉన్న బీసీ సంఘాల నాయకులు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. కుల సంఘాల ముసుగులో రాజకీయ అజెండాను పంచుకోవడం సరికాదన్నారు. పట్టణంలో మాజీ మంత్రి బాధితులు బీసీలు ఎంతో మంది ఉన్నారని వారందరికీ ఆనాడు డీకే అరుణ అండగా నిలిచారని గుర్తు చేశారు. గత ఎంపీ ఎన్నికల్లో శాంతికుమార్ పోటీ చేయడానికి ప్రయత్నించారని, కానీ, పార్టీ డీకే అరుణకు టిక్కెట్ ఇచ్చిందని పేర్కొన్నారు. ఆ సమయంలో కొందరు పార్టీకి రాజీనామా చేసి బీజేపీకి వ్యతిరేకంగా పనిచేశారనే అంశాన్ని ఎంపీ డీకే అరుణ రాష్ట్ర అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారన్నారు. పార్టీ అంతర్గత అంశాన్ని కొందరు స్థానిక ఎన్నికల్లో లబ్ధిపొందాలనే ఆలోచనతో కుల సంఘాల వేదిక పంచుకోవడం సరికాదన్నారు. రాబోయే రోజుల్లో శాంతికుమార్‌కు పార్టీ మంచి సముచిత స్థానం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, యాదయ్య, గంగన్న, శివలింగం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొత్త భవనంలోకి అన్నదాన సత్రం

- రేపు ప్రసాద్ స్కీం భవంతిలోకి మార్పు
- నాలుగు నెలల క్రితమే అలంపూర్ ఆలయాలకు అప్పగింత
- వర్చువల్‌గా భవనాన్ని ప్రారంభించిన ప్రధానమంత్రి మోదీ



అలంపూర్ అన్నదాన సత్రం కోసం సిద్ధమైన ప్రసాద్ స్కీం భవనం

అలంపూర్: దక్షిణ కాశీ అలంపూర్ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి క్షేత్రంలో అన్నప్రసాదానికి కొత్త భవనం అందుబాటులోకి రానుంది. ప్రసాద్ స్కీం నిధులతో నిర్మించిన భవంతిలోకి బాలబ్రహ్మేశ్వరస్వామి అన్నదాన సత్రం ఏర్పాటుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయ అర్చక స్వాములు ఖరారు చేసిన ముహూర్తంలో అధికారులు ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం భక్తులకు కొత్త భవనంలో అన్నప్రసాదం వసతి అందుబాటులోకి తీసుకురానున్నారు.

50 ఏళ్లుగా అన్నదాన సత్రం..

అలంపూర్ క్షేత్రంలో 50ఏళ్లుగా శ్రీగంద్రకోట కుమారశాస్త్రి బాలబ్రహ్మేశ్వరస్వామి అన్నదాన సత్రం పేరుతో అన్నప్రసాదం పంపిణీ చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న అన్నదాన సత్రం పురావస్తుశాఖ అధ్వర్యంలో ఉంటుంది. ఈ క్షేత్రందినదినాభివృద్ధి చెంది భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగినప్పటికీ.. సత్రంలో 50నుంచి 100 మంది వరకు మాత్రమే భోజనం చేయడానికి అవకాశం ఉంది. దీంతో అన్నప్రసాదం పొందడానికి భక్తులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. పాత అన్నదాన సత్రంలో మార్పులు చేయడానికి పురావస్తు శాఖ నుంచి అనుమతులు వచ్చే పరిస్థితి లేకపోవడంతో అసౌకర్యాల నడుమే సత్రం కొనసాగుతోంది.

రూ. 37కోట్ల వ్యయంతో కొత్త భవంతి..

కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీం ద్వారా రూ. 37కోట్లు మంజూరు చేయడంతో అన్ని హంగులతో భవనం నిర్మించారు. ఈ భవంతిలో ఒక బ్లాక్‌ను అన్నదాన సత్రం కోసం కేటాయించారు. ఇదివరకే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ఈ భవంతిని ప్రారంభించడంతో ఆలయాలకు అప్పగించారు. ప్రస్తుతం అన్నదాన సత్రం కోసం కేటాయించిన బ్లాక్‌లో 1000 మంది వరకు కూర్చోని తినడానికి అవకాశం ఉంటుంది. సాధారణ రోజుల్లో ఆలయాలకు 400 మంది వరకు భక్తులు అన్నప్రసాదం కోసం వస్తారని.. సెలవు దినాల్లో 800 నుంచి 1,200 మంది వరకు అన్నప్రసాదం కోసం వస్తారు. మహాశివరాత్రి, దేవీ శరన్నవరాత్రులు, వసంతి పంచమి వంటి ప్రత్యేక రోజుల్లో అన్నప్రసాదం కోసం వచ్చే భక్తుల సంఖ్య భారీగా ఉంటుంది. భక్తుల రద్దీకి అనుగుణంగా కొత్త భవనంలో పెద్ద హాల్‌తో పాటు కిచెన్, సరుకుల నిల్వకు ప్రత్యేక గదులు అందుబాటులోకి రానున్నాయి.

నేడు పూజలు.. రేపు ప్రారంభం

ప్రసాద్ స్కీం భవంతిలో అన్నదాన సత్రం ఏర్పాటు సందర్భంగా రెండు రోజులపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పురేందర్ కుమార్ తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు మహా గణపతి పూజ, పుణ్యాహవచనం, సంప్రోక్షణ, ఋత్విక్ వరుణం, మహా కలశ స్థాపన, వాస్తు మండపారాధన, గణపతి, నవగ్రహ, వాస్తు, రుద్ర హోమాలు ప్రత్యేకంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం తెల్లవారుజామున 4:34 గంటలకు గో సహిత గృహప్రవేశం, 11 గంటలకు పూర్ణాహుతి సమర్పణ ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆదిదంపతులైన జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మద్యాహ్నం 1గంటకు అన్నదానం ఉంటుందని ఈఓ తెలిపారు.

అందుబాటులోకి సకల సౌకర్యాలు..



కొత్త భవనంలో అన్నప్రసాదం కోసం వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. భక్తులు కూర్చోని తినడానికి ఏర్పాటు ఉంటుంది. భక్తుల వాహనాల పార్కింగ్, ఇతర సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. భవిష్యత్‌లో ఇతర బ్లాక్‌లు సైతం అప్పగించే అవకాశం ఉంది. భవనం మొత్తం వినియోగంలోకి వస్తే భక్తులకు మరిన్ని సౌకర్యాలు పెరుగుతాయి.

– పురేందర్ కుమార్, ఈఓ



ప్రసాద్ స్కీం భవనంలోని అన్నప్రసాద బ్లాక్

భారీ పాము పట్టివేత



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయిపల్లిలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి ఇంటి ఆవరణలో భారీ పామును స్నేక్‌క్యాచర్, హోంగార్డ్ కృష్ణసాగర్ పట్టుకున్నారు. కారు పార్కింగ్ స్థలంలో ఉన్న పామును ఇంట్లో పని చేసే వారు గుర్తించి భయాందోళనకు గురై కొత్తకోటలో విధులు నిర్వర్తిస్తున్న కృష్ణసాగర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే గ్రామానికి చేరుకుని పామును పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టుకున్న పాము జెర్రిపోతు అని.. ఏడు ఫీట్ల పొడవు, 12 ఏళ్ల వయస్సు, నాలుగు కిలోల బరువు ఉంటుందన్నారు. పాములు కనబడితే తనకు సమాచారం ఇస్తే పట్టుకొని అడవిలో వదిలేస్తానన్నారు.

శిశుగృహలో బాలుడి అప్పగింత



గుర్తు తెలియని బాలుడు

మహబూబ్‌నగర్ క్రైం: మూడేళ్ల బాలుడిని గుర్తు తెలియని వ్యక్తులు వదిలేసి వెళ్లిన మంగళవారం చోటుచేసుకుంది. టూటౌన్ ఎస్ఐ విజయ్‌భాస్కర్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లోని ఓ మజిద్ వద్ద గుర్తు తెలియని మూడేళ్ల బాలుడిని ఎవరో వదిలేసి వెళ్లినట్లు మంగళవారం డయల్ 100కు కాల్ వచ్చింది. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి బాలుడిని రక్షించారు. ఎవరైనా యాచకులు వదిలేసి వెళ్లారా? లేక ఇంకా ఎవరైనా వదిలేసి వెళ్లారా అనే అంశంపై విచారణ చేస్తున్నామని తెలిపారు. బాలుడి శరీరంపై గాయాలు ఉన్నాయని, శిశుగృహలో అప్పగించినట్లు ఎస్ఐ వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.